సంపుటి :03 | సంచిక :42 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

శనివారం 21, మార్చి 2026

వెల ₹5

## రెండు ప్రాణాలు తీసిన 'పిల్లి'పై ప్రేమ

- హైదరాబాద్‌లో ఇద్దరు యువతుల ఆత్మహత్య
- ఒకరు పిల్లి ఇంట్లో వద్దని తల్లిదండ్రులు మందలించినందుకు..
- మరొకరు పెంచుకుంటున్న పిల్లి చనిపోయిందని..

04

## కరీంనగర్‌లో విషాదం

- భార్య మరణించిన ఐదు రోజులకే ఎస్సై ఆత్మహత్య
- అనాథలుగా మిగిలిన ఇద్దరు పిల్లలు

05

# డిజిటల్ స్నేహం

## ..నిలువునా మోసం !

స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంది కదా అని అపరిచితులతో చాటింగ్ చేస్తున్నారా.. జాగ్రత్త సుమా! ఆ చాటింగ్ మీ కొంపముంచే అవకాశం ఉంది. అందమైన ముఖచిత్రాలు, తియ్యని మాటలతో ఆకర్షించే సైబర్ నేరగాళ్లు.. క్షణాల్లో మీ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తారు. పెళ్లి సంబంధాల పేరుతో కొందరు, ప్రేమ పేరుతో మరికొందరు అమాయకులకు వల వేసి లక్షల రూపాయలు కొల్లగొడతారు. తాజాగా వెలుగుచూస్తున్న ఘటనలు చూస్తుంటే సైబర్ నేరగాళ్లు ఎంతటి దారుణాలకు ఒడిగడుతున్నారో అర్థమవుతున్నది. హైదరాబాద్‌కు చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు ఇటీవల సోషల్ మీడియాలో ఒక అందమైన యువతి నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. అతడు రిక్వెస్ట్ యాక్సెప్ట్ చేశాడు. కొద్దిరోజులు చాటింగ్ చేశాక, ఒక రాత్రి ఆమె నుంచి వీడియో కాల్ వచ్చింది. ఆ కాల్ ఎత్తగానే అవతలి వైపు ఒక యువతి నగ్నంగా ఉన్నట్లు కనిపించింది. కంగారుపడి ఆయన కాల్ కట్ చేసేలోపే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఆయన ముఖాన్ని ఆ వీడియోకు తగిలించి మార్ఫింగ్ చేశారు. మరుక్షణమే ఆ వీడియోను సోషల్ మీడియాలో పెడతామని, మీ బంధువులకు పంపుతామని బెదిరిస్తూ బ్లాక్‌మెయిలింగ్ మొదలుపెట్టారు. పరువు పోతుందన్న భయంతో బాధితుడు రూ.మూడు లక్షలు చెల్లించాల్సి వచ్చింది. ఇది 'సెక్స్‌టార్షన్' అనే కొత్త రకం హనీట్రాప్ మోసం.

— అక్షరదర్బార్, వరంగల్

అవగాహనే మనకు రక్ష..

అప్రమత్తతే శ్రీరామరక్ష..

అపరిచితులతో చాటింగ్ వద్దు గురూ!


వీడియో కాల్ .. అసలే వద్దు బాసూ..

మీ బ్యాంక్ ఖాతా గుల్ల.. మీ సంపాదన గుల్ల

అమ్మాయిల ఏఐ వీడియోలకు ఆకర్షితుడవు కాకు..

ఒక్క హనీట్రాప్‌లో చిక్కితే.. ఇక అంతే సంగతులు

02




## వర్ధన్నపేట యువకుడి రూ.20 లక్షలు గుల్ల

`వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన ఒక యువకుడికి ఇటీవల మ్యాట్రిమోనీలో ఫేక్ ప్రొఫైల్‌తో ఒక అమ్మాయి పరిచయమైంది. తనది భూపాలపల్లి అని పరిచయంచేసుకుంది. ఆమెను నమ్మి యువకుడు ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ. 20 లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. సదరు మహిళ పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి, రకరకాల వ్యక్తిగత అవసరాలంటూ విడతల వారీగా బాధితుడి నుంచి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసింది. తీరా పెళ్లి ప్రస్తావన వచ్చేసరికి ముఖం చాటేయడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. నిందితురాలు బాధితుడి భావోద్వేగాలతో ఆడుకుంటూ, నమ్మకాన్ని పెట్టుబడిగా పెట్టి ఆర్థికంగా దెబ్బకొట్టింది. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లు, ఫేక్ మహిళల ఏఐ వీడియోలతో తస్మాత్ జాగ్రత్త యువకులారా!`



## భక్తి శ్రద్ధలతో రంజాన్

### ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

ఇస్లాం మతస్తులు అత్యంత పవిత్రంగా ఆచరించే రంజాన్ వేడుకలను ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు అంత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన పలు ప్రార్థనల్లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. మట్టేవాడ, ఎల్బీనగర్, ఖిలా వరంగల్ ప్రాంతాల ఈద్గాల్లో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర రంజాన్ మాసంలో నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించి ఆధ్యాత్మికతతో పండుగను జరుపుకుంటున్న ముస్లిం సోదర, సోదరీమణులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

— అక్షరదర్బార్, వరంగల్

03



## మరోసారి తెరమీదకు

### ఎమ్మెల్యేల ఫిరాయింపు వివాదం

- దానం నాగేందర్‌కు క్లీన్‌చిట్‌పై హైకోర్టుకు బీజేపీ నేత ఏలేటి
- సోమవారం విచారించనున్న న్యాయస్థానం
- ఆ రోజు కోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

05



- అపరిచితులతో చాటింగ్ వద్దు గురూ!
- వీడియో కాల్ .. అసలే వద్దు బాసూ......
- అమ్మాయిల ఏఐ వీడియోలకు ఆకర్షితుడవు కాకు..
- ఒక్క హనిట్రాప్‌లో చిక్కితే.. ఇక అంతే సంగతులు
- మీ బ్యాంక్ ఖాతా గుల్ల.. మీ సంపాదన గుల్ల
- అవగాహనే మనకు రక్ష.. అప్రమత్తతే శ్రీరామరక్ష..

# డిజిటల్ స్నేహం నిలువునా మోసం !

**అక్షరదర్బార్, వరంగల్**

స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంది కదా అని అపరిచితులతో చాటింగ్ చేస్తున్నారా.. జాగ్రత్త సుమా! ఆ చాటింగ్ మీ కొంపముంచే అవకాశం ఉంది. అందమైన ముఖచిత్రాలు, తియ్యని మాటలతో ఆకర్షించే సైబర్ నేరగాళ్లు.. క్షణాల్లో మీ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తారు. పెళ్లి సంబంధాల పేరుతో కొందరు, ప్రేమ పేరుతో మరికొందరు అమాయకులకు వల వేసి లక్షల రూపాయలు కొల్లగొడతారు. తాజాగా వెలుగు చూస్తున్న ఘటనలు చూస్తుంటే సైబర్ నేరగాళ్లు ఎంతటి దారుణాలకు ఒడిగడుతున్నారో అర్థమవుతున్నది. హైదరాబాద్‌కు చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు ఇటీవల సోషల్ మీడియాలో ఒక అందమైన యువతి నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. అతడు రిక్వెస్ట్ యాక్సెప్ట్ చేశాడు. కొద్దిరోజులు చాటింగ్ చేశాక, ఒక రాత్రి ఆమె నుంచి వీడియో కాల్ వచ్చింది. ఆ కాల్ ఎత్తగానే అవతలి వైపు ఒక యువతి నగ్నంగా ఉన్నట్లు కనిపించింది. కంగారుపడి ఆయన కాల్ కట్ చేసేలోపే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఆయన ముఖాన్ని ఆ వీడియోకు తగిలించి మార్ఫింగ్ చేశారు. మరుక్షణమే ఆ వీడియోను సోషల్ మీడియాలో పెడతామని, మీ బంధువులకు పంపుతామని బెదిరిస్తూ బ్లాక్‌మెయిలింగ్ మొదలుపెట్టారు. పరువు పోతుందన్న భయంతో బాధితుడు రూ.మూడు లక్షలు చెల్లించాల్సి వచ్చింది. ఇది 'సెక్స్‌టార్షన్' అనే కొత్త రకం హనీట్రాప్ మోసం.

## - వరంగల్ బాధితుడికి గిఫ్ట్ ప్యాకెట్ శాపం

వరంగల్‌కు చెందిన మరో వ్యక్తికి విదేశీ యువతి పేరుతో పరిచయం ఏర్పడింది. తాను లండన్‌లో డాక్టర్‌గా పని చేస్తున్నానని, భారత్‌పై ఉన్న ఇష్టంతో ఖరీదైన ఐఫోన్, బంగారం, విదేశీ కరెన్సీని గిఫ్ట్‌గా పంపుతున్నానని ఆమె నమ్మబలికింది. రెండు రోజుల తర్వాత ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ అధికారులమంటూ యువకుడికి కొందరు ఫోన్ చేసి, మీ పేరు మీద పెద్ద పార్శిల్ వచ్చిందని, దానికి క్లియరెన్స్ ఫీజులు, పన్నులు కట్టాలని కోరారు. అది నిజమేనని నమ్మిన బాధితుడు వారు చెప్పిన వివిధ బ్యాంకు ఖాతాలకు సుమారు రూ.5 లక్షలు బదిలీ చేశాడు. చివరకు ఆ పార్శిల్ అందకపోగా, అవతలి ఫోన్ నంబర్లు స్విచ్ఛాఫ్ అవ్వడంతో తాను మోసపోయానని యువకుడు లబోదిబోమన్నాడు.

## - ఖాతాలు ఖాళీ చేసే సైబర్ మాయాజాలం

సైబర్ నేరగాళ్ల ప్రధాన లక్ష్యం బాధితుల భయం లేదా ఆశ. ఒక్కసారి వారి వలలో చిక్కి డబ్బులు పంపడం మొదలుపెడితే, బాధితుడి వద్ద ఉన్న చివరి రూపాయి వరకు లాగేందుకు వారు ప్రయత్నిస్తారు. వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు వారి చేతికి చిక్కితే ఇక బ్లాక్‌మెయిలింగ్‌కు హద్దే ఉండదు. వీరు వాడే అకౌంట్లు అన్నీ నకిలీవి కావడంతో పాటు, వీరు తరచుగా సిమ్ కార్డులు మారుస్తూ పోలీసులకు చిక్కకుండా జాగ్రత్త పడతారు. ముఖ్యంగా ఏఐ టెక్నాలజీతో రూపొందించే 'డీప్ ఫేక్' వీడియోల వల్ల అసలు అది నిజమైన కాల్ లేక నకిలీదా అని గుర్తించడం సామాన్యులకు కష్టతరంగా మారుతోంది.

## - జాగ్రత్తలు పాటిస్తేనే

అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులను ఆమోదించే ముందు పదిసార్లు ఆలోచించాలి. సోషల్ మీడియాలో ప్రొఫైల్ పిక్చర్లు చూసి మోసపోకూడదు. మ్యాట్రిమోనీ సైట్లలో పరిచయమైన వారు డబ్బు అడిగితే వెంటనే అనుమానించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో వీడియో కాల్స్ మాట్లాడటం, వ్యక్తిగత ఫొటోలు పంచుకోవడం చేయకూడదు. ఒకవేళ ఎవరైనా బ్లాక్ మెయిల్ చేస్తే భయపడి డబ్బులు పంపకుండా, వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి లేదా సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కు సమాచారం ఇవ్వాలి. మీ భయమే నేరగాళ్లకు పెట్టుబడి అని గుర్తుంచుకోండి.



# మంత్రి సీతక్కకు ఉత్తమ సేవా పురస్కార్

## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అందుకోనున్న మంత్రి సీతక్క

అక్షర దర్బార్ /ములుగు జిల్లా ప్రతినిధి: శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (ఎస్ ఆర్ ఎఫ్) ఆధ్వర్యంలో కరోనా మహమ్మారి కష్టకాలంలో ప్రజలకు విశేష సేవలు అందించినందుకు రాష్ట్ర మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్కకి "ఉత్తమ సేవా పురస్కార్" అవార్డును ప్రదానం చేయనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు వెల్లడించారు. ఈ అవార్డును భారతదేశ 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరం వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఏప్రిల్ 24న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఘనంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు ఎంపికకు సంబంధించిన అధికారిక పత్రాన్ని నేడు ములుగు జిల్లా కేంద్రంలో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (ఎస్ ఆర్ ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేశ్, రాష్ట్ర కార్యదర్శి తోట రాజు, గౌరవ సలహాదారులు చిలువేరు శంకర్, పులికంటి రాజేందర్ కలిసి మంత్రి సీతక్క కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, కరోనా సమయంలో మంత్రి సీతక్క చేసిన సేవలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని, ఆమె సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ బానోత్ రవిచందర్ , మార్కెట్ కమిటి చైర్ పర్సన్ రేగా కళ్యాణి , ములుగు పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల బిక్షపతి , వార్డు కౌన్సిల్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పోచమ్మ తల్లి ఆలయానికి కొత్త వెలుగులు

## కరెంట్ లైన్ నిర్మాణం ప్రారంభం



అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం కంటాత్మకూర్ గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లి ఆలయం అభివృద్ధికి కీలకంగా నూతన కరెంట్ లైన్ నిర్మాణం ప్రారంభమైంది. విద్యుత్ శాఖ అధికారులు సుమారు 200 మీటర్ల మేర నాలుగు కొత్త పోల్స్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేశారు.గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోంగంటి తిరుపతి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధితో పాటు గ్రామంలో మరిన్ని సీసీ రోడ్లు, హైస్కూల్ కాంపౌండ్ వాల్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. ఆలయ స్థల వివాదంపై కూడా ఉన్నతాధికారుల సమక్షంలో సర్వే నిర్వహించి పరిష్కారం చూపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# బియ్యం అందజేత

అక్షర దర్బార్ శాయంపేట: శాయంపేట మండలం పెద్దకొడేపాక గ్రామానికి చెందిన కోగిల పద్మ పోషయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు పెద్దకూతురు కోగిల స్రవంతి వివాహం ఉందని తెలుసుకున్న బయ్యారం ఎస్ఐ సోదరుడు కోగిల తిరుపతి సోదరబావంతో స్రవంతి కుటుంబానికి రూ.పదివేల విలువ చేసే బియ్యం అందజేశారు.



# ముస్లింకు చైర్మన్ శుభాకాంక్షలు

## ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్

అక్షర దర్బార్,పరకాల: పవిత్ర రంజాన్ సందర్భంగా పరకాల పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదరులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. శాంతి, సోదరభావానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగను తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యంతో నిర్వహిస్తోందన్నారు.



# ఘనంగా రంజాన్ వేడుకలు



- ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కొండా సురేఖ

అక్షరదర్బార్, వరంగల్: పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఎల్‌బీనగర్, మట్టేవాడ (పోతననగర్), ఖిలా వరంగల్ ఈద్గాల్లో ముస్లిం సోదరులతో శనివారం కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అల్లాహ్ దీవెనలతో ప్రజలందరికీ సుఖ శాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. రంజాన్ పండుగ సోదరభావం, దాతృత్వం, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మత సామరస్యాన్ని పెంపొందించే ఈ పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు, స్థానిక ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.





## అల్లా దయతో అందరూ బాగుండాలి

అక్షర దర్బార్, చిట్యాల : అల్లా దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నామని ముస్లిం పెద్దలు తెలిపారు శనివారం  చిట్యాల మండల కేంద్రంలోని కౌసరే  ఏ మసీద్ ఆవరణలోని ఈదుగా మైదానంలో పవిత్ర రంజాన్ పండుగ వేడుకలు ముస్లిం సోదరులందరూ అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ అలాయ్ బలాయి తీసుకుని  ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న మండల మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రాజ్ మహమ్మద్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్క ముస్లిం 30 రోజుల పాటు చేసిన కటోర ఉపవాస దీక్ష  విరమించుకొని ఈరోజు ఈద్గా లో నమాజ్ ప్రార్ధన చేసుకుని ఆప్తులను స్నేహితులను కలుసుకొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసుకోవడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మజీద్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అజ్మత్ మియా హైదర్ పాషా ఉపాధ్యక్షులు షఫీ పాషా జాయింట్  సెక్రెటరీ అక్బర్ ట్రెజరర్ హుస్సేన్ ఆరిఫ్ సాజిత్ మహమూద్ అల్లి పాషా పాల్గొన్నారు.

## మొగుళ్లపల్లి మండలంలో

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు మండలంలోని మొగుళ్లపల్లి రంగాపురం ఇష్పేట మొట్లపల్లి బంగ్లాపల్లి తదితర గ్రామాలలో రంజాన్ వేడుకలను మైనార్టీ సోదరులు ఘనంగా నిర్వహించారు ప్రార్ధన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మొగుళ్ళపల్లి ఎస్సై ఎం సురేష్ ప్రత్యేక టీమ్లను ఏర్పాటు చేసి ప్రశాంతంగా నిర్వహించుటకు కృషి చేశారు,

## ఈద్ ముబారక్ తెలిపిన ఇనగాల

అక్షరదర్బార్, పరకాల: పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మరియు వరంగల్ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పరకాల పట్టణంలోని ముస్లిం సోదరులకు హృదయపూర్వక 'ఈద్ ముబారక్' తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ పండుగ మానవాళికి శాంతి, ప్రేమ మరియు త్యాగ నిరతిని చాటిచెబుతుందని కొనియాడారు. ముస్లిం సోదరులు నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఆచరించిన ఉపవాస దీక్షలు సమాజంలో క్రమశిక్షణను, పేదలకు చేసే దానధర్మాలు సామాజిక సమానత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నాయకత్వంలో తెలంగాణలో మత సామరస్యం వెల్లివిరుస్తోందని, నియోజకవర్గ ప్రజలందరూ ఐక్యంగా పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. సమాజంలో శాంతి సౌభాగ్యాలు వర్ధిల్లాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కౌన్సెలర్లు, మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు సన్మానం

రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరుల ఇళ్లకు వెళ్లిన చైర్మన్ సునీల్ కుమార్, మహమ్మద్ అలీని సన్మానించారు. అనంతరం డిసిసి జిల్లా అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డితో కలిసి తేనేటి విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సోద అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ మీకు దివ్య విద్యాసాగర్, కౌన్సిలర్లు కొయ్యడ శ్రీనివాస్, గూడెల్లి సదన్ కుమార్, పసుల రమేష్, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, బండి శ్రీధర్,పాలకుర్తి శ్రీనివాస్, అల్లె దశరధం, సమన్వయ కమిటీ సభ్యులు మేరుగు శ్రీశైలం, పొరండ్ల వేణు, మడికొండ శీను, మడికొండ సంపత్, ఒంటెరు శ్రవణ్, ఎండీ రంజాన్ ఆలీ, జాఫర్ రిజ్వి, మంద నాగరాజు, పబ్బ శీను కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు





# రెండు ప్రాణాలు తీసిన 'పిల్లి'పై ప్రేమ

- హైదరాబాద్‌లో ఇద్దరు యువతుల ఆత్మహత్య
- ఒకరు పిల్లి ఇంట్లో వద్దని తల్లిదండ్రులు మందలించినందుకు..
- మరొకరు పెంచుకుంటున్న పిల్లి చనిపోయిందని..




అక్షరదర్బార్, హైదరాబాద్ : మూగజీవాలపై ఉన్న మితిమీరిన ఇష్టమో లేక క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలో తెలియదు కానీ, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువతులు తమ నిండు నూరేళ్ల జీవితాన్ని అర్ధాంతరంగా ముగించుకున్నారు. ఉన్నత చదువులు చదువుతూ ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థినులు ఇలా చిన్న కారణాలతో బలవన్మరణానికి పాల్పడటం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.

**- పిల్లి కోసం గొడవ.. ఎంబీబీఎస్ విద్యార్థిని బలి**

అల్వాల్‌కు చెందిన తుమ్మల ప్రిన్సి శ్రేష్ఠ అనే యువతి ఎంబీబీఎస్ చదువుతోంది. ఇంట్లో పిల్లిని పెంచుకోవాలన్నది ఆమె కోరిక. అయితే, పిల్లుల వల్ల ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని, ఆరోగ్యానికి మంచిది కాదని తల్లిదండ్రులు ఆమెను మందలించారు. ఈ విషయంలో గత కొన్ని రోజులుగా ఇంట్లో వాగ్వాదం జరుగుతోంది. నిన్న కూడా ఇదే విషయమై తల్లిదండ్రులతో గొడవ పడిన ప్రిన్సి, తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వైద్య విద్యనభ్యసిస్తూ ఇతరుల ప్రాణాలు కాపాడాల్సిన యువతి, ఇలా చిన్న మొండితనం వల్ల ప్రాణాలు తీసుకోవడం ఆ కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బతీసింది.

**- పెంచుకున్న పిల్లి మరణం తట్టుకోలేక..**

మరో హృదయ విదారక ఘటన మీర్‌పేట్‌లో వెలుగు చూసింది. హిమబిందు  అనే బీఎస్సీ విద్యార్థిని గత రెండేళ్లుగా ఒక పిల్లిని ప్రాణప్రదంగా పెంచుకుంటోంది. అయితే, ఇటీవల ఆ పిల్లి అనారోగ్యంతో మరణించింది. తను ఎంతో ఇష్టంగా చూసుకున్న మూగజీవం దూరం కావడాన్ని హిమబిందు తట్టుకోలేకపోయింది. తీవ్రమైన మానసిక వేదనకు గురైన ఆమె, పిల్లి లేని లోకంలో తాను ఉండలేనంటూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పెంపుడు జంతువులపై ఉండాల్సిన ప్రేమ కాస్తా ప్రాణాంతకమైన వ్యామోహంగా మారడం ఇక్కడ విషాదం.



## సోద పరామర్శ ..

అక్షర దర్బార్,పరకాల: పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన పలు కుటుంబాలను పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ పరామర్శించారు. పట్టణంలోని 17వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుర్రం కిషన్ తల్లి గుర్రం పుష్ప, అలాగే మున్సిపల్ సిబ్బంది బుస్స రవి, కుమార్‌ల తండ్రి ఐలయ్య మరణించగా, వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బొచ్చు సుభద్ర సాల్మన్, కౌన్సిలర్ పసుల లావణ్య రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, నాయకులు రేండ్ల సంపత్, గుర్రం వినయ్, బొచ్చు అనంత్, బొచ్చు జెమిని, మడికొండ సాంబయ్య, బొచ్చు సంపత్, బొచ్చు ప్రవీణ్, కోడెపాక రాకేష్ పాల్గొన్నారు.



## చిట్యాల ఎస్సైని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

అక్షర దర్బార్, చిట్యాల :  ఇటీవల చిట్యాల నూతన ఎస్సైగా పదవి బాధ్యతలను చేపట్టిన పోచంపల్లి సతీష్ ను శనివారం  బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అల్లం రవీందర్ ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి గొర్రె సాగర్ ఇతర నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఎస్సైని శాలువాలతో సన్మానించారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ క్రాంతి కుమార్ రెడ్డి మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్ బాబు నాయకులు తౌటం నవీన్ పాండ్రాల వీరస్వామి బుర్ర శ్రీధర్ జెట్టి కుమారస్వామి  ఆరేపల్లి సమ్మయ్య గాజా అశోక్  చిలుముల రమణాచారి మేడిపల్లి శ్రీనివాస్ దామర రాజు కట్కూరి రాజేందర్ ఎలేటి రాజు చందు గుండా సురేష్ ముడతనపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాల ఎస్సైని కలిసిన జనసేన నాయకులు

అక్షర దర్బార్ చిట్యాల :  చిట్యాల పోలీస్ స్టేషన్‌లో కొత్తగా నియమితులైన ఎస్ఐ సతీష్ గారిని  జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వక కలిసి  శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నాయకులు మాట్లాడుతూ, చిట్యాల మండలంలో శాంతి భద్రతలు మరింత బలపడాలని, ప్రజలకు పోలీసులు మరింత చేరువగా ఉండాలని ఆకాంక్షించారు. ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ.. చిట్యాల మండల ప్రజలకు ఎప్పుడైనా ఏ సమస్యలు ఉన్నా వెంటనే స్పందించి సహాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జనసేన జయశంకర్ భూపాలపల్లి జెర్రిపోతుల సనత్‌కుమార్ జిల్లా నాయకులు దేవేందర్  చిట్యాల మండల జనసేన కో-ఆర్డినేటర్ అన్నారపు రమణ కుమార్ గారితో పాటు నాయకులు చెర్లపల్లి వెంకటేష్, మామిడాల దేవేందర్, జూకల్ అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.







## పక్కా ప్లాన్ తోనే హత్య

**- అదనపు కట్నం వేధింపులే ఘాతుకానికి కారణం**

అక్షరదర్బార్, కాజీపేట: కాజీపేట మండలం కడిపికొండలో ఈనెల 18న జరిగిన తండ్రి, కుమార్తెల మృతి కేసులో సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయి. అదనపు కట్నం వేధింపులే ఈ ఘాతుకానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కడిపికొండకు చెందిన రాజశేఖర్ (51), అతని కుమార్తె రాజశ్రీ (24) మార్చి 18 తెల్లవారుజామున వారి నివాసంలోనే సజీవ దహనమయ్యారు. రాజశ్రీకి 2023లో పొక్కుల ప్రవీణ్‌తో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.3 లక్షల కట్నం ఇచ్చినప్పటికీ, ప్రవీణ్ అదనపు కట్నం కోసం రాజశ్రీని నిరంతరం వేధిస్తుండేవాడు. పిల్లల అన్నప్రాసన వేడుక కోసం రాజశ్రీ తన పుట్టింటికి వచ్చిన క్రమంలో ఈ దారుణం జరిగింది. నిందితుడు ప్రవీణ్ మార్చి 18 తెల్లవారుజామున నిద్రిస్తున్న తన భార్య రాజశ్రీ, మామ రాజశేఖర్‌పై మొదట భౌతిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం వారిపై డీజిల్ పోసి నిప్పంటించి కిరాతకంగా చంపేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు, వారు ఆత్మహత్య చేసుకున్నారంటూ స్వయంగా బంధువులకు ఫోన్ చేసి నమ్మించే ప్రయత్నం చేశాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలపై ఉన్న గాయాలను గుర్తించి అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి చెల్లెళ్లు తేజస్వి, మనోజ్ఞ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మడికొండ పోలీసులు లోతుగా విచారించగా అసలు విషయం బయటపడింది. నిందితుడు ప్రవీణ్‌ను కడిపికొండ బ్రిడ్జి సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కిరాతక ఘటనలో 18 నెలల జయాంశ్, 6 నెలల జయశ్రీ అనే ఇద్దరు పసిపిల్లలు అనాథలుగా మిగిలారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే







అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో 62 మంది లబ్ధిదారులకు 21లక్షల 97వేల రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సీఎం సహాయ నిధి ఒక వరం లాంటిదని తెలిపారు.ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ఈ నిధి ఎంతో ఉపయోగపడుతుందని, ముఖ్యంగా అత్యవసర వైద్య చికిత్సలు, ప్రమాదాలు,ఇతర అత్యవసర అవసరాల సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం సహాయ నిధిని వినియోగించుకోవాలని,ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు బుచ్చిరెడ్డి ఎంపీడీవో ఫణిచంద్ర, ఎఎంసి వైస్ చైర్మన్ మారపల్లి బుజన్న, మాజీ జడ్పీటీసీ చల్ల చక్రపాణి, సర్పంచ్ ఐలయ్య, కుమార స్వామి,రాజిరెడ్డి, కృష్ణ మూర్తి,రవి,హైదర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత పోరు

- అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లుకు బీఆర్ఎస్ సిద్ధం
- ప్రజలకు గ్యారెంటీల లబ్ధి చేకూర్చే వరకు పోరాడతాం
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**అక్షరదర్బార్, హైదరాబాద్ :**



తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ సరికొత్త వ్యూహాన్ని ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి సంతకం చేసిన 'అభయహస్తం' ఫైల్ కనిపించకుండా పోయిందని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వచ్చే శుక్రవారం అసెంబ్లీలో ఈ గ్యారెంటీలకు చట్ట పరమైన రక్షణ కోరుతూ 'ప్రైవేట్ మెంబర్ బిల్లు' ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల్లో కనీసం 'అర' గ్యారెంటీ కూడా ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో అమలు కాలేదని తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వానికి నిజంగా మహిళలు, రైతులు, విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే తాము ప్రవేశపెట్టే ప్రైవేట్ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో ఎన్టీఆర్ హయాంలో కూడా ఇటువంటి ప్రైవేట్ బిల్లులు చట్టాలుగా మారిన చరిత్ర ఉందని ఆయన గుర్తు చేశారు. "మా బిల్లు గనుక చట్టమైతే.. మహిళలకు నెలకు రూ.2,500, రైతు భరోసా కింద రూ.15,000, విద్యార్థులకు విద్యా భరోసా కార్డులు పొందడం ప్రజల హక్కుగా మారుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ బిల్లుకు తమ ప్రాంత ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చేలా ప్రజలు కూడా వారిపై ఒత్తిడి తీసుకురావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

**- నాలుగు కోట్ల మందికి టోపీ..**

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్, ఇప్పటివరకు నాలుగు కోట్ల మంది ప్రజలకు టోపీ పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి పదవీ స్వీకార ప్రమాణం చేసిన రోజున ఆరు గ్యారెంటీల దస్త్రంపై సంతకం చేశారని గవర్నర్ ప్రసంగంలో చెప్పించినా, తీరా చూస్తే ఆ ఫైలే మాయమైందని విమర్శించారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలే కాబట్టి, సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు స్పీకర్ అనుమతించాలని, అధికార పార్టీ కూడా దీనికి సహకరించాలని ఆయన కోరారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ ప్రైవేట్ బిల్లు రాజకీయంగా పెను దుమారం రేపే అవకాశం కనిపిస్తోంది.



# కరీంనగర్‌లో విషాదం

- భార్య మరణించిన ఐదు రోజులకే ఎస్సై ఆత్మహత్య
- అనాథలుగా మిగిలిన ఇద్దరు పిల్లలు

అక్షరదర్బార్, కరీంనగర్ : కరీంనగర్ జిల్లాలో ఒకే కుటుంబంలో వారం వ్యవధిలో జరిగిన రెండు ఆత్మహత్యలు స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్, తన అత్తగారింట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఐదు రోజుల క్రితమే ఆయన భార్య దివ్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మరవకముందే, ఇప్పుడు ఎస్సై కూడా ప్రాణాలు తీసుకోవడం జిల్లా పోలీసు వర్గాల్లో విషాద ఛాయలు నింపింది. ఎస్సై చంద్రశేఖర్ భార్య దివ్య ఐదు రోజుల క్రితమే బలవన్మరణానికి పాల్పడ్డారు. భార్య మరణంతో తీవ్ర మానసిక వేదనకు గురైన చంద్రశేఖర్, ఆ బాధను తట్టుకోలేక అత్తగారింట్లోనే ఈ దారుణానికి ఒడిగట్టారు. భార్యాభర్తలు ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు తనువు చాలించడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే, వీరిద్దరి ఆత్మహత్యలకు గల అసలు కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ విషాద ఘటనలో అందరినీ కలిచివేస్తున్న అంశం ఏమిటంటే.. ఆ దంపతులకు ఉన్న ఇద్దరు చిన్న పిల్లలు. కళ్లముందే అమ్మానాన్నలు ఇద్దరూ దూరమవ్వడంతో ఆ చిన్నారులు ఇప్పుడు అనాథలుగా మారారు. పచ్చని సంసారంలో ఆత్మహత్యలు చిచ్చు రేపడంతో ఆ పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. అసలు కుటుంబంలో ఏం జరిగింది? ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులేమిటి? అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.

# మాజీ డీజీపీ మనుమరాలికి సైబర్ షాక్

- ఆమె వాట్సాప్ డీపీతో అకౌంటెంటు కు వల
- రూ.1.20 కోట్లు స్వాహా
- సైబర్ పోలీసులను ఆశ్రయించడంతో వెలుగులోకి మోసం



అక్షరదర్బార్, హైదరాబాద్ : సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అదుపు లేకుండా పోతోంది. సామాన్యులే కాదు, ఉన్నత స్థాయి వ్యక్తులు కూడా వీరి మాయాజాలంలో చిక్కుకుని భారీగా నష్టపోతున్నారు. తాజాగా ప్రముఖ మహిళా వ్యాపారవేత్త, మాజీ డీజీపీ మనుమరాలు దొడ్ల దివ్యారెడ్డి పేరుతో ఆమె అకౌంటెంట్‌ను బురిడీ కొట్టించిన సైబర్ ముఠా, ఏకంగా రూ.1.20 కోట్లను కాజేసింది. సుమారు 18 కంపెనీలకు డైరెక్టర్‌గా దివ్యారెడ్డి వ్యవహరిస్తున్నారు. ఆమె వాట్సాప్ డీపీతో సైబర్ నేరగాళ్లు తన అకౌంటెంట్‌కు వల వేశారు. ఈ నెల 17న దివ్యారెడ్డి అకౌంటెంట్‌కు ఆమె పేరుతో ఒక వాట్సాప్ సందేశం వచ్చింది. తాను ప్రస్తుతం ఒక ముఖ్యమైన మీటింగ్ లో ఉన్నానని, అత్యవసరంగా తన ఖాతాకు రూ.1.20 కోట్లు పంపాలని ఆ సందేశం సారాంశం. అది తన బాస్ నుంచి వచ్చిన ఆదేశమేనని నమ్మిన అకౌంటెంట్, ఎటువంటి సందేహం లేకుండా సదరు మొత్తాన్ని నేరగాళ్లు సూచించిన ఖాతాకు బదిలీ చేశాడు. అయితే, కొద్దిసేపటికే మళ్లీ డబ్బు పంపాలని మరో సందేశం రావడంతో అకౌంటెంట్‌కు అనుమానం కలిగింది. రెండోసారి నిధుల కోసం అభ్యర్థన రావడంతో, చెక్ అప్రూవల్ కోసం అకౌంటెంట్ నేరుగా దివ్యారెడ్డిని సంప్రదించాడు. గతంలో పంపిన రూ.1.20 కోట్ల వివరాలను ఆమెకు వివరించగా, తాను అలాంటి సందేశం పంపలేదని ఆమె స్పష్టం చేయడంతో అకౌంటెంట్ కంగుతిన్నాడు. తాము సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డామని గ్రహించిన దివ్యారెడ్డి, వెంటనే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ఆ నిధులు ఏ ఖాతాలకు వెళ్లాయనే కోణంలో దర్యాప్తు వేగవంతం చేశారు.



# మరోసారి తెరమీదకు ఎమ్మెల్యేల ఫిరాయింపు వివాదం

- దానం నాగేందర్‌కు క్లీన్‌చిట్‌పై హైకోర్టుకు బీజేపీ నేత ఏలేటి
- సోమవారం విచారించనున్న న్యాయస్థానం
- ఆ రోజు కోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

అక్షరదర్బార్, హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఇప్పుడు న్యాయస్థానం వేదికగా కొత్త మలుపు తిరిగింది. దానం నాగేందర్ పార్టీ మారలేదంటూ అసెంబ్లీ స్పీకర్ క్లీన్‌చిట్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి శనివారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్పీకర్ ఇచ్చిన తీర్పును తక్షణమే రద్దు చేయాలని (క్వాష్) కోరుతూ ఆయన కోర్టును ఆశ్రయించడంతో, సోమవారం జరగబోయే విచారణపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గత లోక్‌సభ ఎన్నికల్లో దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేసిన విషయాన్ని ఏలేటి తన పిటిషన్‌లో ప్రధానంగా ప్రస్తావించారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి, మరో పార్టీ తరపున ఎంపీగా నామినేషన్ దాఖలు చేయడం నిఖార్సైన ఫిరాయింపు కిందకే వస్తుందని ఆయన వాదించారు. నామినేషన్ పత్రాల ఆధారంగా దానం నాగేందర్‌పై తక్షణమే అనర్హత వేటు వేయాలని, పార్టీ మారిన తర్వాత ఆయన పొందిన ఎమ్మెల్యే జీతభత్యాలను కూడా వెనక్కి తీసుకోవాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఫిరాయింపులపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సోమవారం కోర్టు వెలువరించే అభిప్రాయం లేదా ఇచ్చే ఆదేశాలు రాష్ట్రంలోని ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేల భవితవ్యాన్ని కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. దీంతో ఆ రోజు ఏం జరుగుతుందోనని అటు రాజకీయ నేతలు, ఇటు సామాన్య ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# దుస్తుల పంపిణీ

అక్షర దర్బార్ శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు శాయంపేట మండలం నర్సింహులపల్లి, గ్రామంలో శనివారం కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో మైనారిటీలకు రంజాన్ పండుగ సందర్భంగా(రంజాన్ తోఫా) దుస్తులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేందర్, కాంగ్రెస్ నాయకులు కృష్ణ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.




# మీ గొంతుక! మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915